సాక్షి
అనంతపురం

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 22 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు ధర పలికాయి.



కిలో టమాట రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.6.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/ 22.4°
జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

సత్వర పరిష్కారం

- 'స్పందన'కు ఐదు మాసాల్లో 6,788 ఫిర్యాదులు
- జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల్లో వారంలోపే 60 శాతం పరిష్కారం
- రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్ సమస్యల పైనే ఎక్కువ ఫిర్యాదులు
- కోర్టు కేసులు మినహా మిగతా అన్నింటికీ పరిష్కార మార్గాలు


గుత్తిలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్ గౌతమికి అర్జీ అందజేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోక, ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకునే అధికారి లేక సామాన్యులు నీరసించిపోయిన కాలమది. పరిస్థితి మారింది. సమస్యల పరిష్కారానికి పదునెక్కింది. గ్రామ స్థాయి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ వరకూ ఫిర్యాదు చేశారంటే దానిపై అధికారులు ఉరుకులు పరుగుల మీద సమస్యకు పరిష్కారం చూపించాల్సిందే. దీంతో పాటు ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ప్రారంభించారు. దీంతో ఇప్పుడు పరిష్కారం మరింత వేగవంతం అయ్యింది. సామాన్యులు.. సంపన్నులు అనే తేడా ఉండదు.. ఎవరికి సమస్య వచ్చినా అధికారులు స్పందిస్తున్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో తెలుగుదేశం పార్టీ నేతలు తమ వర్గానికి మాత్రమే లబ్ధి చేకూర్చేవారు. ఇప్పుడు కుల, మత, వర్గ తారతమ్యం లేకుండా అర్హులైన వారందరికీ 'స్పందన' ఒక పరిష్కార మార్గంగా పనిచేస్తోంది.

ఫోన్ చేస్తే చాలు పరిష్కారానికి దారి..
ఇప్పటికే ప్రతి సోమవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో 'స్పందన' నిర్వహిస్తున్నారు. ఇందులోనే చాలామటుకు దరఖాస్తులకు పరిష్కారం లభిస్తోంది. అయినా సరే ప్రతి ఒక్కరికీ సంతృప్తస్థాయిలో పరిష్కారం జరగాలన్న ముఖ్య ఉద్దేశంతో 'జగనన్నకు చెబుదాం' (1902 ఫోన్‌కాల్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో జిల్లాలో భారీగా ఫిర్యాదులు వచ్చాయి. గడిచిన ఐదు మాసాల్లో 6,788 ఫిర్యాదులు రాగా 5,336 పరిష్కరించారు. ఇందులో 'జగనన్నకు చెబుదాం'కు వచ్చిన ఫిర్యాదుల్లో 60 శాతం ఫిర్యాదులు వారంలోపే పరిష్కరించడం గమనార్హం.

కోర్టు కేసులతో కొన్ని ఫిర్యాదులకు ఇబ్బంది..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువగా భూ వివాదాలు, ఆక్రమణలు, ఉమ్మడి కుటుంబాల్లో ఆస్తుల పంపకాలు వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై అధికారులు ఆరా తీయగా కోర్టుల్లో కేసులు నమోదై ఉండటంతో పరిష్కారం లభించడం లేదు. ఇలాంటి కేసులే వందల్లో నమోదవుతున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

గడిచిన ఐదు మాసాల్లో స్పందనకు వచ్చిన ఫిర్యాదులు.. పరిష్కారమైనవి

విభాగం	వచ్చిన దరఖాస్తులు	పరిష్కారమైనవి
రెవెన్యూ (సీసీఎల్‌ఏ)	2,072	1,319
హౌసింగ్ కార్పొరేషన్	1,313	1,194
ఎస్‌పీడీసీఎల్	649	492
పంచాయతీరాజ్	629	489
వ్యవసాయశాఖ	564	512
సర్వే సెటిల్‌మెంట్స్ ల్యాండ్ రికార్డ్స్	410	330
పోలీసు	396	348
మున్సిపాలిటీ	391	326
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్	202	176
సివిల్ సప్లయీస్	162	150

సమస్యల పరిష్కారమే లక్ష్యం
రకరకాల సమస్యలతో సోమవారం రోజున 'స్పందన'కు వస్తున్నారు. ఇందులో మెజారిటీ సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. వచ్చిన వినతులను వెంటనే సంబంధిత సిబ్బందికి పంపించి పర్యవేక్షిస్తున్నాం. దీనిపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉంటుంది.
–గౌతమి, కలెక్టర్, అనంతపురం

రేషన్ కార్డు వెంటనే వచ్చింది
నాకు రేషన్ కార్డు లేదు. కార్డు కోసం జూలై నెలలో జరిగిన స్పందన కార్యక్రమంలో బ్రహ్మసముద్రం తహసీల్దార్ బాలకిషన్‌కు వినతిపత్రం అందజేశాను. అధికారులు వెంటనే స్పందించి మా సచివాలయానికి నా దరఖాస్తును పంపి.. ఆగస్టు ఒకటో తేదీన బియ్యం కార్డు మంజూరు చేశారు. ఇప్పుడు మా ఇంట్లో నలుగురికీ రేషన్ వస్తోంది.
– క్రిష్ణయ్య, గొల్లలదొడ్డి గ్రామం, బ్రహ్మ సముద్రం మండలం

'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన
గుత్తి: పట్టణంలోని నిజామి షాదీ ఖానాలో కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' (ప్రత్యేక స్పందన) కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కలెక్టర్ గౌతమితో పాటు అధికారులు 165 అర్జీలు స్వీకరించారు. మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి కోరారు. గుత్తి చెరువును హంద్రీ– నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలతో నింపాలని, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మద్యం షాపును తొలగించాలని ఎంపీపీ విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా తదితరులు అర్జీ అందజేశారు. గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ కోరారు. ఈ మేరకు అర్జీ అందజేశారు. హిందూ శ్మశాన వాటికకు ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని వాల్మీకి సంఘం నాయకులు బాచీ వినతిపత్రం అందజేశారు. గుత్తి వర్కింగ్ జర్నలిస్టులు సర్వే నంబర్ 724లో తమకు గతంలో కేటాయించిన ఇంటి స్థలాలు ఇవ్వాలని అర్జీ ఇచ్చారు. స్థలాలు, భూముల సమస్యలపై అధికంగా అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అధికారులు కూడా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార మార్గాలు సూచించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్ర, గుత్తి తహసీల్దార్ మహబూబ్ బాషా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రూప్లానాయక్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం నీలమయ్య, డీఎస్‌ఓ శోభారాణి, ఎంఈఓ రవినాయక్, ఆర్‌ఐ సందీప్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' అద్భుతం


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి

గుత్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' చాలా అద్భుతమైన కార్యక్రమమని కలెక్టర్ గౌతమి, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గుత్తిలోని పాత మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 45 రోజుల పాటు 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వేతో పాటు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. వలంటీర్లు, సచివాలయ గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య కార్యదర్శులు క్యాంపెయిన్ చేస్తారన్నారు. ఎంత మంది రోగాలతో బాధపడుతున్నారు.. వారికి ఎలాంటి వైద్యం అవసరం అనే విషయాలను తెలియజేసి సేవలందేలా చూస్తారన్నారు. ఇది ముమ్మాటికీ అద్భుతమైన కార్యక్రమమన్నారు. డీసీహెచ్‌ఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, ఎంపీపీ విశాలాక్షి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష
అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 17న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఐదు, ఆరో సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జెక్టు ఫెయిలైన వారు ఇన్‌స్టంట్ పరీక్ష రాయవచ్చునని తెలిపారు. ఇది వరకు ఇచ్చిన పాత హాల్‌టికెట్‌తోనే పరీక్షకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు.

జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ల నియామకం
అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్లుగా బయన బోయిన గోపీనాథ్, రాగే పరుశురాం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్య సేవలందించండి


ఎద్దులపల్లి పీహెచ్‌సీ సిబ్బందితో కేంద్ర బృందం సభ్యులు


పామిడి: ఎద్దులపల్లి పీహెచ్‌సీని శుక్రవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ బృందం ఆకస్మిక తనిఖీ చేసింది. ఈ బృందంలోని వైద్యులు ఆశా బర్నీత్, సుబ్రన్‌జ్యోతిరావు ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, వైద్య సేవలపై సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది అందుబాటులో ఉండి అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులకు సీనియార్టీ జాబితా సిద్ధం



రాప్తాడురూరల్: సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పని చేస్తూ స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతులు పొందేందుకు అర్హులైన టీచర్లతో సీనియార్టీ జాబితాను తయారు చేశారు. దీన్ని డీఈఓ బ్లాగ్‌స్పాట్‌లో ఉంచారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22లోగా డీఈఓ కార్యాలయంలో తెలియజేయాలని డీఈఓ నాగరాజు సూచించారు. సీనియార్టీ జాబితాలో ఉన్న వారిలో ఎవరైనా పదోన్నతి పొందేందుకు సుముఖత లేకపోతే 'అన్‌విల్లింగ్' ఇవ్వాలని ఆదేశించారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు 25 వరకు పొడిగింపు



రాప్తాడురూరల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. డిసెంబరు 3న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

19న పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్



అనంతపురం మెడికల్ : వివిధ పారా మెడికల్ కోర్సుల శిక్షణకు ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ టెన్త్, ఇంటర్, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహం

- ఈ ఏడాది 300 యూనిట్ల స్థాపన లక్ష్యం
- యూనిట్ విలువపై 35 శాతం రాయితీ
- స్వయం ఉపాధితో పాటు నలుగురికి జీవనోపాధి లక్ష్యంగా పథకం


అనంతపురంలోని మసాలా పొడుల తయారీ పరిశ్రమను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: సూక్ష్మ తరహా ఆహారశుద్ధి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహం కల్పిస్తోంది. స్వయం ఉపాధితో పాటు మరో నలుగురికి పని కల్పించడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ పథకం (పీఎం ఎఫ్ఎంఈ) కింద ఈ ఏడాది 300 చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలని జిల్లాకు లక్ష్యం నిర్దేశించారు. రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీఓలు), స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), వ్యక్తిగతంగానూ, ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు ముందుకు వస్తే రూ.10 లక్షల యూనిట్ విలువలో గరిష్టంగా 35 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. అంటే యూనిట్ విలువలో 10 శాతం లబ్ధిదారులు భరిస్తే 35 శాతం రాయితీ పోనూ మిగతా 55 శాతం బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా కుటీర పరిశ్రమల ఏర్పాటు లాభదాయకంగా ఉండటంతో పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. గరిష్టంగా రూ.10 లక్షల వరకు 35 శాతం రాయితీ వర్తిస్తుంది. అవసరమైతే చిన్నపాటి ఓళిగ సెంటర్ లాంటివి పెట్టుకున్నా రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు కూడా తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు వెంటనే ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), ఉద్యానశాఖ జిల్లా అధికారి (డీహెచ్‌ఓ) బి.రఘునాథ రెడ్డి (79950 86792), రీసోర్స్ పర్సన్ పీటర్ సైమన్ (94402 69833)లను సంప్రదించవచ్చు.

అన్ని రకాల యూనిట్లు అందుబాటులో..
పీఎం ఎఫ్ఎంఈ కింద అన్నిరకాల ఆహారశుద్ధి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. లబ్ధిదారులు కోరుకున్న 63 రకాల యూనిట్ల ఏర్పాటుకు సైతం ఆమోదం తెలిపింది. మామిడి, జామ పండు గుజ్జు తయారీ, పండ్ల రసాలు, మామిడి తాండ్ర, ఎండబెట్టిన పండ్లు, ఎండబెట్టిన పండ్ల పొడులు, పండ్ల జామ్, జెల్లీ తయారీ, ఊరగాయలు, బంగాళదుంప, కాకర, అరటి చిప్స్, టమాట సాస్, కెచప్, ఎండబెట్టిన అంజూర పండ్లు, ఫ్రూట్ క్యాండీస్, డ్రైడ్, సాల్టెడ్ నట్స్, ట్యూటీ ఫ్రూటీ ఉత్పత్తుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. వీటితో పాటు ఎండు కొబ్బరి పొడులు, సగ్గు బియ్యం, కార్న్‌స్టార్చ్ పొడి, సూప్‌మిక్స్, ఎర్రమిరప ఫ్లేక్స్, కేకులు, బిస్కెట్లు, అప్పడాలు, కార్న్‌ఫ్లేక్స్, పాప్‌కార్న్, రవ్వ పిండి, మరమరాలు, అటుకులు, సేమియా, పప్పుచెక్కలు, వేరుశనగ బటర్, ఎర్రకారంపొడి, కొబ్బరినూనె, వెల్లుల్లి పేస్ట్, అల్లంపొడి, బెల్లం, మాసాలా పౌడర్, చింతపండు, చక్కెర, పాలశుద్ధీకరణ, ఫ్లేవర్డ్ మిల్క్, క్రీమ్, వెన్న, నెయ్యి, పన్నీర్, చీజ్, పాలకోవా, ఐస్‌క్రీమ్, ఇన్‌స్టంట్ మిక్స్, గులాబ్‌జామ్ మిక్స్, ఉప్మా మిక్స్, చేపలు, రొయ్యల సాస్ వంటివీ ఉన్నాయి. ఇంకా చేపల ఊరగాయ, రొయ్యల ఊరగాయ, ఎండుచేపలు, రొయ్యలు, చిరుధాన్యాల రవ్వ, పిండి, చిరుధాన్యాల ఉత్పత్తులు, బిస్కెట్లు, రాగిమాల్ట్, దాల్ మిల్లింగ్, వంటనూనెలు, ఉప్పు, సుగంధ ద్రవ్యాలు, చాక్లెట్లు, తేనె, జీడిపప్పు, గోధుమ పిండి, రవ్వ, మైదా, సోయా పాలు, చంక్స్, మురబ్బా, వడియాలు, గొట్టాలు, నూడుల్స్, పాస్తా తదితర ఉత్పత్తులు తయారీకి అనువైన యూనిట్లకు అవకాశం కల్పించారు.

వెంటనే సంప్రదించాలి
ఆసక్తి కలిగిన వారు యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వస్తే ప్రోత్సాహక రాయితీలు కల్పిస్తామని ఈడీ బి.రఘునాథరెడ్డి, రీసోర్స్ పర్సన్ పీటర్ సైమన్ తెలిపారు. అన్ని రకాల రెడీ టూ ఈట్ చిరుతిళ్లు, ఉత్పత్తులు తయారు చేసే యూనిట్లకు ప్రాధాన్యత ఇస్తూనే మిగతా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, అలాగే షిఫ్ ఆంధ్రా ఔట్‌లెట్లకు కూడా రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. గతేడాది వివిధ వర్గాలు వివిధ రకాలకు చెందిన 150 యూనిట్ల వరకు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేసినట్లు తెలిపారు.


ఉత్సవాలను తిలకించడానికి వచ్చిన భక్తులు

ఘనంగా షంషేర్ వేడుక
ఉరవకొండ: హజరత్ బీబీ జైనబ్బీ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం షంషేర్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున అశ్వంపై షంషేర్‌ను ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దర్గా ఆవరణలో నిర్వహించిన ఖవ్వాలీ పోటీలు ఆకట్టుకున్నాయి.

పలువురు జడ్జీల బదిలీ
అనంతపురం: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు జడ్జీలను బదిలీ చేశారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా కోర్టుకు సంబంధించి జి.శ్రీదేవి (అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి-7, ఫ్యామిలీ కోర్టు)ని కడప ప్రిన్సిపల్ జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. గుత్తి సివిల్ జడ్జి టి.హరితను అనంతపురం ఫ్యామిలీ కోర్టు అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జిగా బదిలీ చేశారు. బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.సాదు బాబును అనంతపురం ఎస్సీ, ఎస్టీ కేసుల న్యాయస్థానం స్పెషల్ జడ్జిగా నియమించారు. అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.దీనబాబును కడప ఎస్సీ, ఎస్టీ కేసుల న్యాయస్థానం స్పెషల్ జడ్జిగా బదిలీ చేశారు. వీరు ఈ నెల 29లోపు బదిలీ అయిన స్థానాల్లో బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు 'వైఎస్సార్ కాపు నేస్తం' నగదు జమ

- నాల్గో విడతలో ఉమ్మడి జిల్లాలో 11,950 మందికి లబ్ధి



అనంతపురం రూరల్: కాపు, ఒంటరి, బలిజ, తెలగ ఉప కులాల్లో ఉన్న మహిళల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు వారికి ఆర్థిక స్వావలంబన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'వైఎస్సార్ కాపు నేస్తం' పథకం నాల్గో విడత నగదు శనివారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు విడతల్లో 31,914 మందికి లబ్ధి చేకూరింది. నేడు తూర్పుగోదావరి జిల్లా నిడదనవోలులో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నాల్గో విడత నగదును జమ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో మొదటి విడత కింద ఒకొక్కరికి రూ.15వేల చొప్పున 10,241 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 15.36 కోట్లు, రెండో విడతలో 10,344 మంది ఖాతాల్లో రూ.15.51 కోట్లు, మూడో విడతలో 11,329 మంది ఖాతాల్లో రూ.16.99 కోట్లు నగదు జమ అయింది. నాల్గవ విడతలో 11,950 మంది ఖాతాల్లోకి రూ.17.09 కోట్లు జమ కానుంది. అర్హులందరికీ పథకం అందేలా చర్యలు తీసుకున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించిన నగదు జమ కార్యక్రమం రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సర్వజనాస్పత్రిలో కీచకుడు
- రేడియాలజీ విభాగంలో మహిళా రోగులతో అసభ్య ప్రవర్తన

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో ఓ ఉద్యోగి కీచకపర్వం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... రేడియాలజీ విభాగంలో ఓ రేడియో గ్రాఫర్ ఎక్స్‌రేలు తీసేవాడు. ఇటీవల ఓ మహిళ తన కాలుకు దెబ్బ తగిలిందని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చూయించుకుంది. ఆర్థో వైద్యులు ఎక్స్‌రేకు రెఫర్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న రేడియోగ్రాఫర్ కాలుకు ఎక్స్‌రే ఉంటే చేయి తదితర ప్రాంతాల్లో సదరు మహిళను తాకాడు. కాలు సమస్య ఉంటే ఇతర ప్రాంతాల్లో ఎందుకు తాకుతున్నావని సదరు మహిళ నిలదీసింది. ఎక్స్‌రేను మీ సెల్‌కు పంపుతానంటూ సదరు మహిళ వెంట పడ్డాడు. దీంతో ఆమె విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు రేడియాలజీ వైద్యులకు ఫిర్యాదు చేశారు. ఇదే విధంగానే పలువురు మహిళలతోనూ ఎక్స్‌రే ఫిల్మ్‌లను మీ సెల్‌ఫోన్లకు నేరుగా పంపుతానని, నంబర్లు ఇవ్వాలని వేధించినట్లు తెలిసింది. దీంతో రేడియాలజీ వైద్యులు సదరు రేడియోగ్రాఫర్‌ను ఎక్స్‌రే విభాగం నుంచి ఎక్స్‌రే ప్రిస్కిప్షన్లు రాసే గదికి మార్చారు. ఇదే విషయమై రేడియాలజీ హెచ్‌ఓడీ సురేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా అలాంటి సంఘటనలు ఏవీ జరగలేదని, అయినా ఇలాంటి విషయాలను ఫోన్‌లో మాట్లాడవద్దని నేరుగా తన గదికి రావాలన్నారు.

క్లుప్తంగా

మద్యానికి డబ్బివ్వలేదని యువకుడి ఆత్మహత్య



మృతుడు రామాంజినేయులు

యల్లనూరు: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని రామాంజినేయులు (40) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన యల్లనూరు మండలం చిలమకూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాలమేరకు.. చిలమకూరుకు చెందిన రామాంజినేయులు , పెద్దక్క దంపతులు కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. అయితే కొంతకాలంగా రామాంజినేయులు మద్యానికి బానిసై డబ్బులివ్వాలని భార్యను వేధించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కూడా మద్యానికి డబ్బులివ్వాలని పెద్దక్కను అడిగాడు. పూటగడటమే కష్టంగా ఉందని, ఇచ్చేదిలేదని భార్య తెగేసి చెప్పడంతో అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే లుంగీతో ఫ్యానుకు ఉరివేసుకొని రామాంజినేయులు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది సంక్షేమమే లక్ష్యం



ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: జీఆర్‌పీ సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ దివస్ (గ్రీవెన్స్‌డే) కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్పీ కే.చౌడేశ్వరీ తెలిపారు. శుక్రవారం స్థానిక జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్‌ను నిర్వహించారు. గుంతకల్లు రైల్వే జిల్లా (రైల్వే డివిజన్) వివిధ పోలీసుస్టేషన్‌లల్లో విధులు నిర్వర్తిస్తున్న దాదాపు 13 మంది అర్జీలను స్వయంగా ఎస్పీకి అందజేశారు. ప్రాధ్యనతా క్రమంగా అర్జీలను పరిష్కారిస్తానాని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ చౌడేశ్వరి మాట్లాడుతూ సమస్యలపై సిబ్బంది పదే పదే కార్యాలయం చుట్టు తిరగకుండా వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సంక్షేమ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

అనంతపురం క్రైం: స్థానిక త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గుత్తీరోడ్డులో ఓ వివాహిత ఇంట్లో పైకప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... సప్తగిరి కళ్యాణ మంటపం ఎదురుగా నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణ, చాకలి రాణి (32) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త లక్ష్మీనారయణ హమాలీ పని చేసి కుటుంబాన్ని పోషించేవాడు. తాగుడుకు బానిసైన లక్ష్మీనారాయణ గురువారం కూడా మద్యం తాగిరావడంతో భార్య రాణి వాగ్వావాదానికి దిగింది. ఈ నేపథ్యంలో ఇంట్లోకి వెళ్లి పైకప్పుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇక 'సింగిల్ స్పెషల్ డిగ్రీ'

- ఇప్పటి వరకూ డిగ్రీలో మూడు కామన్ సబ్జెక్టులు
- ఇకపై మేజర్, మైనర్ సబ్జెక్టు కాంబినేషన్‌తో గ్రాడ్యుయేషన్
- 2023–24 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి
- గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే పరిపూర్ణంగా తీర్చిదిద్దేలా కోర్సు
- డిగ్రీ కోర్సుల్లో దరఖాస్తుకు నోటిఫికేషన్ జారీ
- బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ల సమావేశంలో నూతన సిలబస్‌కు రూపకల్పన



అనంతపురం: విద్యా ప్రమాణాల పెంపునకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాజాగా అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ)లో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా నూతన విద్యా ప్రణాళిక(కర్రిక్యులమ్)ను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకూ యూజీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యాబోధన సాగుతుండగా ఇకపై మేజర్ సబ్జెక్టు ఒక్కటే ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగనుంది. 2023–24 విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ మొదటి సంవత్సరం 1, 2 సెమిస్టర్లలో ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గతంలో బీఎస్సీ ఎంపీసీలో మూడు సబ్జెక్టుల కాంబినేషన్ ఉండగా, వాటి స్థానంలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఏదో ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకుని డిగ్రీలో అడ్మిషన్ పొందవచ్చు. రెండో సెమిస్టర్‌లో దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులు బాటు కల్పించారు. తద్వారా మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్యను పూర్తి చేసేలా సమూల మార్పులు చేశారు. ఇందుకు సంబంధించిన విద్యా ప్రణాళికను మార్పు చేస్తూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు నూతన సిలబస్‌కు రూపకల్పన చేశారు. డిగ్రీలో ఏదైనా ఒక సబ్జెక్టులో విద్యార్థులు సంపూర్ణ నైపుణ్యాలను సాధించే దిశగా ఈ విద్యాప్రణాళిక ఉండడం గమనార్హం. త్వరలో ఈ నూతన సిలబస్‌ను అకడమిక్ స్టాండింగ్ కౌన్సిల్‌లో పెట్టి ఆమోదింపజేయనున్నారు.

బీఎస్సీ, బీఏ, బీకామ్‌లో అమలు:
డిగ్రీలో మేజర్ సబ్జెక్టుతో పాటు కచ్చితంగా ఒక మైనర్ సబ్జెక్టు చదవాలనే నిబంధన పెట్టారు. ఉదాహరణకు ఒక సైన్స్ విద్యార్థి మైనర్ సబ్జెక్టుగా ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సంగీతం, యోగా, డేటా సైన్స్ , మార్కెటింగ్.. ఇలా ఇతర సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చు. ఆర్ట్స్ విద్యార్థులు మైనర్‌లో (ఇంటర్మీడియట్ కోర్సుల ఆధారంగా) నచ్చిన సబ్జెక్టు తీసుకోవచ్చు. కొత్త విధానాన్ని బీఎస్సీతో పాటు బీఏ, బీకామ్ డిగ్రీలో అమలు చేయనున్నారు. డిగ్రీ విద్యలో ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు ఇంజినీరింగ్‌తో సమానంగా తీర్చిదిద్దేందుకు ఈ విద్యా సంస్కరణలు దోహదం కానున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో ఇప్పటికే తొలి దఫా అడ్మిషన్లు పూర్తయ్యాయి. కొత్త విధానంపై డిగ్రీలో చేరే విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించి అడ్మిషన్ కలిప్పించారు.

నాలుగో ఏడాది డిగ్రీకి అనుమతి:
ఇప్పటి వరకూ మూడో ఏడాది డిగ్రీ విద్య పూర్తయ్యేది. నూతన జాతీయ విద్యావిధానం–2020 అమలులో భాగంగా దేశంలో తొలిసారిగా విద్యా సంస్కరణలను ఏపీలోనే అమలు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని అందుబాటులోకి తీసుకువచ్చారు. యూజీసీ ఫ్రేమ్ వర్క్స్ ప్రకారం డిగ్రీని రెండు విధాలుగా విభజించారు. మూడేళ్ల డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించిన వారు రీసెర్చ్ ఆనర్స్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పీజీ లేకుండా నేరుగా పీహెచ్‌డీకి అర్హత సాధిస్తారు. మూడేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైతే జనరల్ ఆనర్స్ కోర్సుగా పరిగణిస్తారు. ఇది పూర్తి చేసిన వారు పీజీలో రెండో ఏడాదిలో చేరవచ్చు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఆనర్స్ కోర్సుల అమలుకు గత మూడేళ్లలో వరుసగా 30 శాతం అడ్మిషన్లతో పాటు సంబంధిత కోర్సుల్లో ఇద్దరు డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు ఉంటేనే అనుమతి మంజూరు చేస్తున్నారు.

సింగిల్ సబ్జెక్టుపై ప్రధాన దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కోర్సులో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచే సింగిల్ సబ్జెక్టు స్పెషల్ డిగ్రీ విధానం అమల్లోకి వచ్చింది. ఒక సబ్జెక్టుపై పూర్తి స్థాయి పట్టు సాధించడంతో పాటు, ఇతర సబ్జెక్టుల్లోనూ అవగాహన పెంపొందేలా నూతన విద్యా ప్రణాళికకు రూపకల్పన చేశారు. ఇప్పటికే నూతన విద్యా ప్రణాళికను ఉన్నత విద్యా మండలి పూర్తి చేసింది. ఈ అంశాలను బోర్డ్‌ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ల సమావేశంలో ఆమోదించారు. త్వరలో అకడమిక్ స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత కొత్త సిలబస్ అమల్లోకి వస్తుంది.

– ప్రొఫెసర్ కె.రాంగోపాల్, సీడీసీ డీన్, ఎస్కేయూ

మహిళలంటే జగనన్నకు విశ్వాసం

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం: మహిళలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో విశ్వాసమని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని 07, 08వ సచివాలయాల మహిళా సంఘాల సభ్యులతో అయ్యప్ప ఆలయ భవన సముదాయంలో శుక్రవారం మహిళా సంక్షేమ పథకాలపై మంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అమ్మఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో పాటు మహిళల పేరిట విలువైన ఇంటి స్థలాన్ని కూడా అందించారన్నారు. మహిళలు అండగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చనే నమ్మకం జగన్‌కు ఉందన్నారు. రాబోవు రోజుల్లో మరింతగా వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటూ బలపరచాలని చెప్పారు. టీడీపీ చేస్తున్న అసత్య ఆరోపణలు, అబద్ధపు మాటలను నమ్మకూడదని సూచించారు. అనంతరం విద్యానగర్‌లో నివాసముంటున్న హంపమ్మ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుధీర్, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ తిరుమల వెంకటేశులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ అర్చన, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు హేమ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

కళ్యాణదుర్గం: భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీఓ నిశాంత్ రెడ్డికి సూచించారు. అనంతరం పలు రికార్డులను జేసీ తనిఖీ చేశారు. ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పలు భూ సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

కాపుల ఆత్మగౌరవం తాకట్టు

- పవన్ కళ్యాణ్‌పై ఎమ్మెల్యే అనంత ఆగ్రహం



అనంతపురం కార్పొరేషన్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రానున్న ఎన్నికల్లో టీడీపీతో కలసి బరిలో దిగుతున్నామని ప్రకటించి కాపుల ఆత్మగౌరవాన్ని టీడీపీ కాళ్ల వద్ద తాకట్టు పెట్టారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం బుడ్డప్పనగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే అనంత విలేకరులతో మాట్లాడారు. కాపులకు రాజ్యాధికారం అంటూ పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించారని, దాదాపుగా పదేళ్ల పాటు కాపులను మభ్యపెట్టారన్నారు. 2014లో టీడీపీకి జనసేన మద్దతునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక ఓట్లతో వైఎస్సార్‌సీపీకి లబ్ధి కలగకూడదన్న లక్ష్యంతో పొత్తు లేకుండా పోటీ చేశారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించాలనే ఇప్పుడు మళ్లీ టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయన్నారు. రెండు పార్టీలు కలసి పోటీచేస్తాయని పవన్ చెప్పడంలో ఆశ్చర్యమేమీ లేదన్నారు. చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ దత్తపుత్రుడన్న భావన ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. అనేక కేసుల్లో స్టేలు తెచ్చుకున్న చరిత్ర టీడీపీ అధినేత చంద్రబాబుకు ఉందన్నారు. ఇప్పుడు స్కిల్ స్కాంలో చంద్రబాబును అరెస్టు చేస్తే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎవరు ఏకమైనా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని, తమ పొత్తు ప్రజలతోనే ఉంటుందన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని గ్యాస్ గోడౌన్ ఏరియా కూరకూలగుట్ట వద్ద శుక్రవారం ఉదయం ఓ ఎలుగుబంటి సంచారంతో పరిసర కాలనీవాసులు బెంబేలెత్తిపోయారు. గ్యాస్ గోడౌన్ ఏరియా వద్ద నివాసం ఉంటున్న దేవేంద్రప్ప (60) ఉదయం 6 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళుతుండగా ఎలుగుబండి దాడి చేసింది. ఆ సమయంలో స్థానికులు గమనించడంతో పాటు కుక్కలు వెంటబడటంతో ఎలుగుబంటి పరారైనట్లు బాధితుడు తెలిపారు. ఎలుగుబంటి దాడిలో దేవేంద్రప్ప చేయి, కాలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు.

టీడీపీ కౌన్సిలర్లపై కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ కమిషనర్ విధులకు ఆటంకం కల్గించినందుకు ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ జి.రవి తన చాంబర్‌లో జగనన్న ఆరోగ్య సురక్షపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తుండగా వర్క్‌ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరెడ్డి కూడా కమిషనర్‌తో చర్చించేందుకు వెళ్లారు. అంతలోనే టీడీపీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు అబ్దుల్ రహీమ్, సరస్వతితో పాటు కౌన్సిలర్లు మల్లికార్జున, రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి, షెక్షావలి కమిషనర్ చాంబర్‌లోకి చొచ్చుకెళ్లారు. కమిషనర్ రవి సమీక్ష సమావేశాన్ని ముగించడంతో సిబ్బంది వెళ్లిపోగా వర్క్‌ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరెడ్డి మాత్రమే ఉన్నారు. కమిషనర్‌తో మాట్లాడుతుంటే ఇక్కడ నీకేం పనంటూ వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు కమిషనర్‌తో కూడా కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవితో పాటు మిగతా వారు కూడా వాగ్వివాదానికి దిగారు. విధి నిర్వహణలో భాగంగానే తన చాంబర్‌కు వచ్చాడని కమిషనర్ చెబుతున్నా వారు వినలేదు. వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరెడ్డితో పాటు కౌన్సిలర్లకు కూడా కమిషనర్ సర్దిచెప్పి పంపించారు. టీడీపీ కౌన్సిలర్లు తరచూ తన విధులకు ఆటంకం కల్గిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ జి.రవి గురువారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు అబ్దుల్ రహీం, షేక్‌పర్వీన్, మల్లిఖార్జున, జింకా లక్ష్మీదేవి, షెక్షావలిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

బ్రిడ్జీల నిర్మాణంలో అగ్రగామిగా భారత్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జెస్ ప్రెసిడెంట్ వినయ్‌గుప్తా

అనంతపురం: బ్రిడ్జి, టన్నెల్స్ నిర్మాణంలో మన దేశం అగ్రగామిగా ఉందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జి ఇంజినీర్స్ ప్రెసిడెంట్ వినయ గుప్తా అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 'మోడర్న్ డే బ్రిడ్జెస్ అండ్ మెట్రో స్ట్రక్చర్స్' అనే అంశంపై శుక్రవారం ఒక్క రోజు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఎంటెక్ (స్ట్రక్చర్స్, బ్రిడ్జి అండ్ టన్నెల్ ఇంజినీరింగ్) కోర్సును భారత రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ ఆర్థిక సాయంతో నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఈ కోర్సును నిర్వహిస్తున్న తొలి వర్సిటీగా జేఎన్‌టీయూకు గుర్తింపుదక్కిందన్నారు. నిపుణులైన ఇంజినీర్లను తయారు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన మాట్లాడుతూ మన దేశం ప్రపంచంలోనే రెండో అతి పెద్ద రహదారులు కలిగిన దేశమని తెలిపారు. ఇటువంటి సదస్సులు అధ్యాపకులకు, విద్యార్థులకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఐఐబీఈ ఛైర్మెన్ ఆర్.కే. జైగోపాల్, సెక్రెటరీ అరవింద సలేచా, రిజిస్ట్రార్ సి. శశిధర్, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎవరితో పొత్తు పెట్టుకున్నా గెలుపు వైఎస్సార్‌సీపీదే

- మాజీ ఎమ్మెల్యే విశ్వ



ఉరవకొండ: 'టీడీపీ–జనసేన పొత్తు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల అభద్రతాభావానికి సూచిక. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వచ్చే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీదే' అని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ–జనసేన విడిపోతే కదా కొత్తగా పొత్తు పెట్టుకునేందుకని ఎద్దేవా చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత బలమైన వ్యక్తిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మారిపోయారని చెప్పడానికి వీరి కలయికే ఒక ఉదాహరణ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్టు అయిన తరువాత టీడీపీ నిర్వీర్యం అయిపోయిందన్నారు. కేవలం పచ్చమీడియా తప్ప చంద్రబాబు అరెస్టును ఎవరూ పట్టించుకోకపోవడంతో టీడీపీ నేతల్లో భయం పట్టుకుందన్నారు. ఎప్పటికీ అధికారంలోకి రాలేమన్న భయంతోనే చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో పాటు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌ను జైలుకు పిలిపించుకొని పొత్తు ప్రకటన చేయించారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనను ప్రతిపక్ష కార్యకర్తలు సైతం మెచ్చుకుంటున్నారని తెలిపారు. సీఎం జగన్ చెప్పినట్టుగా 175 స్థానాలు గెలుస్తాడనే వణుకు వారిలో మెదలైయిందన్నారు. ఎంతమంది చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం: అంతర జిల్లాల ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా అనంతపురం జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టును శుక్రవారం అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఎంపిక చేశారు. పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన 20 మందిని ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ కోచ్ దాదాఖలందర్ తెలిపారు.శనివారం కదిరిలో ప్రారంభం కానున్న టోర్నీలో ఈ జట్టు పాల్గొననుంది.

జట్టు సభ్యులు: ఉమేష్ చంద్రసింగ్ (ఆత్మకూరు), పీఎం ప్రమీత్ (ఆత్మకూరు) బి.మారుతి (కళ్యాణదుర్గం), సి. మారుతి (ఆత్మకూరు), సి.దిలీప్‌రెడ్డి, పి.మహబూబ్‌బాషా, వి. వెంకటప్రసాద్ (గుత్తి), బి. బాబు(కొనకొండ్ల), బి. వీరసాయి హర్షవర్ధన్ , బి. మహమ్మద్ కైఫ్ (ఆత్మకూరు), ఎన్. శ్రీహరి (గుత్తి). ఎండీ ఆరీఫ్ (గుంతకల్లు), జి. రవి (ఆత్మకూరు), బి.మహేష్ (కళ్యాణదుర్గం), టి. విష్ణు, ఎం. ప్రణీత్ , బి. నాగేంద్ర, ఏ. విష్ణువర్ధన్ (కళ్యాణదుర్గం), వి. ప్రవీణ్ కళ్యాణ్ (ఆత్మకూరు), జి. ఈశ్వరప్రసాద్ (అనంతపురం), ఎం. ప్రవీణ్ (కళ్యాణదుర్గం), ఎస్. మోహన్ (గుత్తి).

'జగనన్న ఆరోగ్య సురక్ష' ను విజయవంతం చేయాలి



ప్రోగ్రాం ఆఫీసర్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం జిల్లాలోని 67 ప్రాంతాల్లో జరిగే ఏఎన్‌ఎం/సీహెచ్‌ఓలు చేపట్టే ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ ప్రోగ్రాం ఆఫీసర్లను ఆదేశించారు.

పర్యవేక్షణాధికారులు వీరే : అనంతపురం యుగంధర్, తాడిపత్రి నారాయణస్వామి, గుంతకల్లు చెన్నకేశవులు, ఉరవకొండ అనుపమ జేమ్స్, కళ్యాణదుర్గం సుజాతరెడ్డి, శింగనమల మలేరియా అధికారి ఓబులు, రాయదుర్గం డెమో ఉమాపతి.

188 స్పెషలిస్టు వైద్యులు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి వివిధ ప్రాంతాల్లో జరిగే వైద్య శిబిరాలకు ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజనాస్పత్రి, డీసీహెచ్‌ఎస్ నుంచి 188 మంది స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి తెలిపారు.

పవన్‌ది జనసేన కాదు చంద్రసేన

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



తాడిపత్రి: పవన్ కళ్యాణ్ స్థాపించిన రాజకీయ పార్టీ జనసేన కాదు.. చంద్రసేన అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య ఎద్దేవా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు కోసమే పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టారని విమర్శించారు. శుక్రవారం గన్నెవారిపల్లి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పైలా మాట్లాడారు. టీడీపీ – జనసేన పొత్తు ఈ నాటిది కాదని, 2014లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు గత ఎన్నికల్లో వామపక్ష పార్టీలతో పొత్తు పెట్టుకున్న సంగతి అందరికీ తెలుసన్నారు. కాపులను నిట్టనిలువుగా ముంచిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని మండిపడ్డారు. సీఎం అంటూ ప్రతిసారి జనసేన నాయకులు, కార్యకర్తలు, కాపులు అంటుంటే, ఆయనకు మాత్రం చంద్రబాబునే సీఎం చేయాలని ఉందన్నారు. బీజేపీతో పెళ్లి చేసుకుని విడాకులివ్వకుండానే టీడీపీతో సంసారం చేయడం ఒక్క పవన్ కళ్యాణ్‌కు మాత్రమే సాధ్యపడిందన్నారు. ఇది ఏ సంబంధమో ప్రజలే చెప్పాలన్నారు. టీడీపీ – జనసేన పొత్తు వలన వైఎస్సార్‌సీపీకి వచ్చే నష్టం ఏమీలేదన్నారు. ఎన్నో స్కాములు చేసిన చంద్రబాబు లాంటి వ్యక్తి అరెస్టు అయితే మంచి శాస్తి జరిగిందనే ప్రజలు భావిస్తున్నారన్నారు. జనసేన, టీడీపీలతో బీజేపీ, ఇతర పార్టీలన్నీ ఏకమై వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చేతిలో చావు దెబ్బతినడం ఖాయమని పైలా స్పష్టం చేశారు.

ట్రాక్టర్ బోల్తా - రైతు మృతి



మృతుడు శివ ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

పుట్లూరు: మండలంలోని రంగరాజుకుంటకు చెందిన పొన్నపాటి శివప్రసాద్‌రెడ్డి (32) అనే యువరైతు శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు.. రంగరాజుకుంటకు చెందిన సంజీవరెడ్డి, పుల్లమ్మ దంపతులకు నలుగురు సంతానం కాగా మూడో కుమారుడైన శివప్రసాద్‌రెడ్డి పొలంలో సేద్యం పనులు చేసి ట్రాక్టర్‌లో ఇంటికి వస్తున్నాడు. ఆ సమయంలో టైర్ పంక్చర్ కావడంతో ట్రాక్టర్ బోల్తా పడటంతో శివప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్‌ఓ గాయత్రిదేవి

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌ఓ గాయత్రిదేవి సూచించారు. ఏదైనా ఇబ్బంది ఉన్నా, సందేహాలు తలెత్తినా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఉద్యోగుల కోసం శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓతో పాటు పరిపాలనాధికారి శ్రీధర్ వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ఉద్యోగుల నుంచి 35 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం డీఆర్‌ఓ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు దాదాపు అన్నీ ఆయా శాఖల పరిధిలో పరిష్కరించాల్సినవే ఉంటున్నాయన్నారు. కాబట్టి అధికారులు వారి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలని చెప్పారు.

వినతులు కొన్ని

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఎఫ్‌ఎన్‌ఓగా పనిచేస్తున్న తమకు వేతనం ఇవ్వడం లేదని షబ్రానీ, పల్లవి, శ్రావణి, పుష్పలత, తదితరులు విన్నవించారు. 11 మందిని ఎఫ్‌ఎన్‌ఓలుగా ఏడాది క్రితం అవుట్ సోర్సింగ్ కింద నియమించారని చెప్పారు. అప్పటి నుంచి వేతనం ఇవ్వడం లేదని తెలిపారు. డీఆర్‌ఓ స్పందిస్తూ డీఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారిని పిలిపించి మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అందరికీ వేతనం వచ్చేలా చూడాలని ఆదేశించారు.
- ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, తదితరులు విన్నవించారు. ఉద్యోగుల సంక్షేమ నిధి నుంచి రుణాలు మంజూరు చేయాలన్నారు. డిమాండ్లను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని వారికి డీఆర్‌ఓ తెలిపారు.

క్లుప్తంగా

డీఎఫ్ఓపై దాడి చేసిన వారిని శిక్షించాలి



నిరసన తెలియజేస్తున్న అటవీశాఖ అధికారులు

అనంతపురం సెంట్రల్: అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్ఓ) వివేక్‌పై దాడిని చేసిన కఠినంగా శిక్షించాలని ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ అసోషియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అటవీశాఖ కార్యాలయంలో ఉద్యోగులు నిరసన తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు హుసేనప్ప మాట్లాడుతూ సానిపాయ అటవీరేంజ్ పరిధిలో కొందరు అటవీభూమి కోసం దరఖాస్తు చేసుకున్నారని, అయితే వారు అనర్హులు కావడంతో జిల్లా స్థాయి కమిటీ దరఖాస్తులను తిరస్కరించారన్నారు. కొందరు పథకం ప్రకారం ఆ జిల్లా కలెక్టరేట్‌లో సమావేశానికి హాజరవుతున్న డీఎఫ్ఓపై దాడి చేశారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామ్‌సింగ్, శ్రీనివాసులు, షాన్‌వాజ్, డివిజన్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

మనిషిని సన్మార్గంలో నడిపించేది సద్గురువే



టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన సీవీవీ గురుపూజోత్సవం

అనంతపురం కల్చరల్: మనిషిని సన్మార్గంలో నడిపించి ఉన్నత స్థితికి చేర్చేది సద్గురువులేనని పలువురు వక్తలు అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జగద్గురు పీఠం ఆధ్వర్యంలో మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవం శుక్రవారం జరిగాయి. తెల్లవారుజామున గణపతి పూజతో గురుపూజోత్సవ వేడుకలను జగద్గురు పీఠం సీనియర్ ప్రతినిధి వీవీకేకే శాస్త్రి ప్రారంభించారు. లక్ష్మీనారాయణ హోమం, సామూహిక లలిత సహస్రనామ పారాయణం చేయించారు.

ఉత్కంఠగా క్రీడాపోటీలు




కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో క్రీడాపోటీలు శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగాయి. ఎస్ఎంసీ క్రీడా పోటీల్లో భాగంగా అండర్-14, అండర్-17 బాలబాలికలకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఆరు మండల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రీడలను ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు ప్రారంభించారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్, యోగా తదితర క్రీడాపోటీలో నిర్వహించి, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. శనివారం నియోజకవర్గంలోని మండలాల్లో ఎంపికైన క్రీడాకారులకు శనివారం పోటీలు ఉంటాయి. నియోజకవర్గ సమన్వయ కర్త రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, కేసుమూర్తి, ఆత్మకూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస ప్రసాద్, ఉపాధ్యాయులు గురుమూర్తి, శ్రీనివాసమూర్తి, పీడీలు జగదీశ్వర్, కుమార్‌రాజా,గోవర్ధన్, రమేష్ పాల్గొన్నారు.

రోగుల సహాయకుల తిష్ట

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలోని వివిధ వార్డుల్లో రోగి సహాయకులు తిష్ట వేశారు. జీజీహెచ్‌లోని గైనిక్, లేబర్, చిన్నపిల్లల, సర్జరీ, ఆర్థో తదితర విభాగాల్లో రోగి సహాయకులు రోగుల మంచాలపై పడుకుంటున్నారు. ఇలా అధిక సంఖ్యలో రోగులు వార్డుల్లో ఉండడం ద్వారా ఇన్ఫెక్షన్ సోకే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్తున్నారు.

ఐదు వైద్య కళాశాలల ప్రారంభం చరిత్రాత్మకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కళాశాలల ప్రారంభోత్సవాన్ని వీక్షిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైద్య విద్యార్థులు

అనంతపురం క్రైం: దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఒకే రోజు ఐదు వైద్య కళాశాలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించడం చరిత్రాత్మకమని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం విజయనగరంలో నూతన వైద్య కళాశాలను సీఎం ప్రారంభించి, మిగితా నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభించడాన్ని అనంతపురం వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్, వైద్య విద్యార్థులు లైవ్‌లో వీక్షించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఏడాది 750 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం, డాక్టర్ బీఆర్ శ్యాంప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు పాల్గొన్నారు.

మోక్షగుండంను ఆదర్శంగా తీసుకోవాలి







జేఎన్‌టీయూఏ, ఎస్కేయూలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీలు జింకా రంగజనార్ధన, మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ ఉద్యోగులు

అనంతపురం: ప్రపంచంలో అత్యధికంగా ఇంజినీర్లను తయారు చేస్తున్న దేశంగా భారత్‌కు గుర్తింపు దక్కిందని, దేశం గర్వించదగ్గ ఇంజినీర్‌గా గుర్తింపు పొందిన మోక్షగుండంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూ అనంతపురంలోని పాలకభవనంలో భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిదర్, ఐఐబీఈ ప్రెసిడెంట్ వినయ గుప్త, సెక్రెటరీ అరవింద సలేచా, చైర్మన్ ఆర్‌కే జైగోపాల్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణా కాంతి, డాక్టర్ జి. మమత, డాక్టర్ శారద పాల్గొన్నారు.

- ఎస్కేయూలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర, ఐబీఎం కంపెనీ ప్రతినిధి పి.రాంబాబు, డీఆర్‌డీఓ సైంటిస్ట్ డాక్టర్ పి. అనిల్ కుమార్, రిటైర్డ్ ఎస్ఈ పీవీ రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి, మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, ఇంతియాజ్ అహమ్మద్, జీఎం బాషా, శ్రీవిజయ పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డేను నిర్వహించారు. కార్యక్రమంలోఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ: స్థానిక పంచాయతీరాజ్ శాఖ జిల్లా కార్యాలయంలో మోక్షగుండం చిత్రపటానికి ఎస్ఈ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) యమ్మాని భాగ్యరాజ్, డీఈఈలు రాజేంద్ర ప్రసాద్, గురుమూర్తి, చంద్రకుమార్, అసోసియేషన్ ప్రతినిధులు పాండురంగారెడ్డి, హుస్సేన్‌బాషా సహా ఇతర ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్: ఇంజినీర్స్ డే సందర్భంగా హంద్రీనీవా కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విగ్రహానికి నివాళులు అర్పించారు. హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, డీఎస్ఈ రాజా, ఈఈ రాజస్వరూప్, రామకృష్ణ, వెంకటరమణ, పలువురు ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని నగరపాలక సంస్థలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి మేయర్ పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు శేఖర్‌బాబు, దుర్గాదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఎస్ఈ నాగమోహన్, డీఈ శేఖర్, దాక్షాయని, ఏఈ బాబావలిపాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించిన పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఇతర ఇంజినీర్లు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేడుకల్లో సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా తదితరులు



ఏఈ బాబావలిని సన్మానిస్తున్న మేయర్ వసీం

బ్యాటరీ మేనేజ్‌మెంట్‌పై పరిశోధనలు అవసరం

అనంతపురం: భవిష్యత్తులో ఎలక్ట్రికల్ వాహనాలకు అధిక ప్రాధాన్య ఏర్పడనుంది.. బ్యాటరీ మేనేజ్‌మెంట్‌పైన విస్తృత పరిశోధనలు అవసరమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన తెలిపారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్నారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా శుక్రవారం వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి సదస్సులతో అధ్యాపకులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడతాయన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ మాట్లాడుతూ రాబోవు పదేళ్లలో ఎలక్ట్రికల్ వాహనాలదే ముఖ్య పాత్ర అన్నారు. శిక్షణ తీసుకున్న అధ్యాపకులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ఈశ్వర్ రెడ్డి, కన్వీనర్ / పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, కోఆర్డినేటర్స్ డాక్టర్ జే. శ్రీనివాసులు, డాక్టర్ ఎం.అంకారావు పాల్గొన్నారు.

ప్రజారోగ్య రక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

రాప్తాడు: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి అన్నారు. మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటా సర్వే, హెల్త్ క్యాంపుల నిర్వహణపై అవగాహన కల్పించారు.అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహా రెడ్డి, ఏఎస్ఎం శ్రీలత, ఎంపీహెచ్ఏ మీనా, వైఎస్సార్ సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోరేది ప్రకాష్‌రెడ్డే



ఆత్మకూరులో సంక్షేమ లబ్ధి బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: టీడీపీ హయాంలో పరిటాల కుటుంబం ప్రజలకు చేసిందేమీలేదని, నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం కోరేది మీ ప్రకాష్‌రెడ్డేనని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రజలకు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరులో ఉదయం నుంచి రాత్రి వరకు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రతి గడపకూ తిరిగారు. టీడీపీ హయాంలో ప్రజలకు ఏ పథకం అందాలన్నా పచ్చ కండువా కప్పుకోవాలని హుకుం జారీచేసేవారు..లేదంటే జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు ఉండాలని చెప్పేవారు.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, టీడీపీకి పని చేసే వారికి కూడా మనం మంచి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అన్నారు.

పరిటాల సునీత 2లక్షల ఉద్యోగాలిప్పించిందట..

'స్కిల్' స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు నాయుడు.. రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు.. ఈ స్కాంమ్‌లో మాజీ మంత్రి పరిటాల సునీత పాత్ర ఉందేమో అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో రాప్తాడు నియోజకవర్గం రామగిరిలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ కోసం బిల్డింగ్ నిర్మించారని, 2019లో జనవరి 6న ఈ భవనాన్ని ప్రారభించారన్నారు. ఆ శిక్షణ కేంద్రంలో ఒక్క నిరుద్యోగికి కూడా శిక్షణ ఇచ్చిందిలేదన్నారు. కానీ సునీత రెండు లక్షల మందికి ఉద్యోగాలు ఇప్పించిందని చెప్పుకుంటోందని, కనీసం రెండువేల మందికి కూడా ఉద్యోగాలు కల్పించిన పాపానపోలేదని విమర్శించారు.

లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ :

మండలంలో నూతన పింఛన్‌దారులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో కలసి సీఎం జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ చిన్నక్క, సర్పంచులు వరలక్ష్మి, ఎర్రిస్వామి, నరసింహ, ఓబులేసు, లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు మాజీ జెడ్పీటీసీ మధు, వాసుదేవరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఫణిరెడ్డి, అతిక్‌రెడ్డి, నాగరాజు, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వెంకటేష్, సచివాలయ కన్వీనర్లు శ్రీరామ్, మురళి, వెంకటేష్, అంజినప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు నచ్చి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో పలువురు శుక్రవారం చేరారు. మండలంలోని సింగంపల్లి తండాకు చెందిన నారాయణస్వామి నాయక్, శ్రీనివాసులు నాయక్, దొడ్డే కొట్టాల గ్రామానికి చెందిన జయన్నకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే అనంత

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బుడ్డప్పనగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు వారికిచ్చిన నమూనా పత్రం, అవుట్ రీచ్ ప్రతి ద్వారా నిర్వహించిన ఇంటింటా సర్వేను పరిశీలించారు.

వైద్యనిపుణులతో సేవలు :

45 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో మొదట వలంటీర్లు సర్వే నిర్వహించి, అనంతరం ఏఎన్ఎం, ఆశా, తదితర సిబ్బంది సర్వే చేసి, ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఎమ్మెల్యే అన్నారు. సమస్య తీవ్రత ఉంటే నగరంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు జరిగే వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు, మెడికల్ ఆఫీసర్ల ద్వారా వైద్యాన్ని అందిస్తారన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలుంటే ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలందించేలా ఆరోగ్యశాఖాధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. మీ ఇంటి సమీపంలోనే అత్యాధునిక సౌలభ్యాలు, కార్పొరేట్ హంగులతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 64 వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులు ఉచితంగా ఇస్తారని, ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంటిలోని ప్రతి సభ్యుడి ఆరోగ్య వివరాలను తెలుసుకొని పక్కాగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. పాలకవర్గం కూడా సర్వే పక్కా జరిగే పర్యవేక్షణ చేపట్టాలని మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సారిక, కార్పొరేటర్లు లీలావతి, రాజేశ్వరి, చంద్రలేఖ, లావణ్య, ఎం దేవి, మీనాక్షమ్మ, సంపంగి రామాంజనేయులు, ఇషాక్, అనిల్, బాబా, నాయకులు సాకే కుళ్లాయస్వామి, నాగార్జున రెడ్డి, రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

అశోక్‌నగర్ బ్రిడ్జి త్వరితగతిన పూర్తి చేయాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని అశోక్‌నగర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అమృత్ స్కీం కింద 22 అడుగులున్న వంతెన తొలగించి 40 అడుగులతో బ్రిడ్జిని నిర్మించనున్నారు. శుక్రవారం అశోక్‌నగర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి అడ్డుగా ఉన్న కరెంటు స్తంభాలను తొలగించాలని ట్రాన్స్‌కో ఈఈ రమేష్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. వంతెన పనులకు ప్రజలు సహకరించాలన్నారు.

అనాథకు 'అమ్మ'ఆశ్రయం

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడోరోడ్డుకు చెందిన లక్ష్మీ కాంతమ్మ కుటుంబ సభ్యులందరినీ పోగొట్టుకొని అనాథగా మారింది. భిక్షమెత్తుకుంటూ పూట గడుపుకుంటోంది. ఈమె పరిస్థితిని గమనించిన అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే చిన్న షెడ్డు వేయించి, ఆశ్రయం కల్పించారు. అయితే విధి వక్రీకరించి ఆమెకు ఇటీవల పక్షవాతం రావడంతో పూర్తిగా భిక్షాటన చేసుకోలేక నానాయాతన పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మానవత్వంతో స్పందించిన అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి మరోసారి మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం ఆమెకు రూ.20 వేలు విలువ చేసే దుస్తులు, మందులు, నిత్యావసర వస్తువులు అందించారు. రూ.13 వేలు వెచ్చించి వీల్ చైర్ కొనిచ్చారు. రూ.10 వేలు నగదు అందించారు. ఆమెకు మందులకు భవిష్యత్తులో కూడా సాయమందిస్తామని ఆయన భరోసా ఇచ్చాడు.



అనాథగా మారిన లక్ష్మీదేవికి ఆర్థిక చేయూత అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో డీ5 సెక్షన్ పరిధిలోని తపోవనం, సోమనాథ్‌నగర్, రంగస్వామినగర్, యువజన కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు.శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

నేడు 'గడప గడపకూ...

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్, ఆటోనగర్, కళాకారుల కాలనీ, రాజరాజేశ్వరి కాలనీ, ఆడిటర్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

టీడీపీకి నాయకత్వమే లేదా?

అనంతపురం కార్పొరేషన్: నలభై ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీ అని చెప్పుకునే టీడీపీకి నాయకత్వమే లేదా? ఆపార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కటకటాలకు వెళ్లాక, ఎమ్మెల్యేగా కూడా గెలవని పవన్ కళ్యాణ్ టీడీపీని లీడ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని మేయర్ వసీం అన్నారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మేయర్ మాట్లాడారు. టీడీపీలో సమర్థవంతమైన నాయకులు లేరా? అని మేయర్ ప్రశ్నించారు. స్కిల్ స్కాంలో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబును ఈ నెల 14న పవన్ కళ్యాణ్ కలిసి, ఆయనకు అనుకూలంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 2014 ఎన్నికల ముందు టీడీపీతో పొత్తు పెట్టుకున్న పవన్ కళ్యాణ్..అప్పట్లో టీడీపీ మేనిఫెస్టో అమలు చేయకున్నా ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, తదితర ప్రతిపక్ష పార్టీలకు భంగపాటు తప్పదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, ఇషాక్, కమల్ భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

ధనం కోసమే పొత్తు : 'ధనం కోసమే టీడీపీతో ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ పొత్తు పెట్టుకున్నారని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నగరపాలక సంస్థలోని ఆయన చాంబర్‌లో డిప్యూటీ మేయర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పవన్ కళ్యాణ్ జనసేనను ధనసేనగా మార్చాడన్నారు. స్కిల్ స్కాంలో జరిగిన అక్రమాలను సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో కోర్టులో సమర్పించారన్నారు. నందమూరి కుటుంబంపై నారా వారు కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు టీవీ చంద్రమోహన్ రెడ్డి, బాబాఫక్రుద్దీన్, అబూసాలేహ, తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో చోరీ

అనంతపురం క్రైం: పట్టణంలోని కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలోని వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో దొంగతనం జరిగింది. నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ సీఐ ప్రతాప్‌రెడ్డి వివరాలమేరకు.. కళ్యాణదుర్గం రోడ్డు వద్ద చాలా కాలంగా రాజస్థాన్‌కు చెందిన శివరాం కుటుంబం వినాయక విగ్రహాలు తయారీ చేస్తూ విక్రయించగా వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే వినాయక చవితికి చాలా మంది విగ్రహాలను బుక్ చేసుకున్నట్లు తెలిపారు. వారు అడ్వాన్సుగా ఇచ్చిన రూ.లక్షా యాభై వేల నగదును గురువారం దొంగలు ఎత్తుకెళ్లారని చెప్పారు. గల్లా పెట్టెతో పాటు విగ్రహాలు బుక్ చేసుకున్న వారి వివరాలతో కూడిన పుస్తకాన్ని కూడా దొంగిలించినట్లు వివరించారు. సీసీ ఫుటేజీ, ఇతర మార్గాల్లో ప్రత్యేక బృందం ద్వారా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు..

విగ్రహాల తయారీ కేంద్రంలో రూ.లక్షన్నరను అపహరించిన దొంగలను పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నగరానికి చెందిన ఇద్దరు యువకులతో పాటు కురుగుంటకు చెందిన మరో యువకుడు కూడా ఈ చోరీలో పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కాగా ఈ విషయాన్ని పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా 24 గంటల వ్యవధిలో దొంగలను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలియడంతో బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొంత మేర నగదు కూడా రికవరీ చేసినట్లు తెలిసింది.



అనంత నగర పరిసరాల్లో మబ్బులు కమ్మేసిన దృశ్యం



నగరంలో కురుస్తున్న వర్షం

నగరం.. వర్షాతిరేకం!

నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండాకాలాన్ని తలపించిన వాతావరణం..సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. కారుమబ్బులు కమ్మేసి ..వాతావరణం చల్లబడింది. ఉన్నట్లుండి ఎండకాస్తూనే వర్షం కురిసింది. దీంతో నగర ప్రజలు వర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ఏబీవీపీ నగర నూతన కమిటీ ఎన్నిక

రాప్తాడురూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 25 మంది సభ్యులతో నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా రామంజి, కార్యదర్శిగా భరత్, సహాయ కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా వసంత్, గుణ, శ్రీధర్, సంయుక్త కార్యదర్శులుగా విజయ్ రాఘవ, రాకేష్, బాబా, చిన్నను ఎన్నుకున్నారు. సమావేశంలో అనంతపురం, కడప సంభాగ్ సంఘటనా ప్రతినిధి చిన్నా శ్రీరామ్, రాష్ట్ర కన్వీనర్ చెన్నయ్య, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.